# పార్టీ

**చప్పుడు లేకుండా తలుపు తెరుచుకుంది. విజయ్ తలుపు దగ్గరే నిలబడి లోపలికి చూసాడు.**

**మానస బెడ్‌మీద కూర్చుని కళ్ళు తెరిచి ఎటో చూస్తుంది. తెరుచుకున్న తలుపు, తలుపు దగ్గరున్న మనిషిని ఆమె చూడనే లేదు. గత ముప్ఫయ్యారు గంటలుగా ఆమె అదే స్థితిలో వుంది.**

అతడు దుఃఖాన్ని దిగమింగుకుంటున్నట్టు పెదవులు బిగపట్టి కొద్దిసేపు అలాగే వుండిపోయాడు. ఆ తర్వాత తలుపు దగ్గరగా లాగి, వెనుతిరిగాడు. మెట్లుదిగి హాల్లోకి వచ్చాక మొబైల్ తీసాడు. "రాబర్ట్!... మానస పరిస్థితిలో ఏ మార్పూ లేదురా... ఏం చేయాలో తోచడంలేదు... ప్లీజ్!... నువ్వోసారి రాగలవా?!"

మొబైల్ కట్ చేసి, సోఫాలో వెనక్కు వాలి కూర్చుంటే క్రితం రాత్రి జరిగిందంతా కళ్ళ ముందు కదలాడింది.

"ఇంకా ఎంత టైమ్ పడుతుంది విజయ్?"

మొబైల్‌లో వినిపించిన ప్రశ్నకు జవాబేం చెప్పాలో తోచక దీర్ఘంగా నిశ్వసించాడు అతడు. మెల్లగా గొణుగుతూ "సారీ మానసా! మీటింగ్ లేటయ్యేలా వుంది..." చివరికి పూర్తి చేసాడు. "... పోనీ... పార్టీకి నువ్వెళ్ళకూడదూ?!"

మానస నిట్టూర్చడం వినిపించింది. "మీరెప్పుడూ ఇంతే".

"ప్లీజ్..."

"హుఁ!... తప్పుతుందా?!... వెళ్తాలేండి."

అతడు రిలాక్స్‌గా ఫీలవుతూ మొబైల్ ఆఫ్‌చేసి పక్కన పెట్టాడు.

మీటింగ్ అయ్యాక, ఆఫీస్ వర్క్ కంప్లీట్ చేసుకుని ఇంటికి చేరుకున్నాడు. మానస మొబైల్‌కి కాల్‌చేసి అడిగాడు. "నువ్వు రావడానికి ఇంకా ఎంత టైమ్ పడుతుంది?"

"మరో అర్ధగంటలో ఇక్కడినుండి బయల్దేరుతాను."

గంటున్నర గడిచాక కూడా ఆమె ఇంటికి చేరుకోకపోయేసరికి మరోసారి కాల్‌చేసాడు. ఫోన్ రింగవుతోంది. కాల్ రిసీవ్ చేసుకోలేదు. అర్ధగంటసేపు కాల్స్‌చేస్తూ అలసిపోయాక, మొదటిసారి అనుమానం కలిగింది. భయమూ మొదలయ్యింది. ఆమెను కాంటాక్ట్ చేయడం ఎలా?!...తన ఫ్రెండ్ పేరు 'సుమ'అని చెప్పింది గాని. ఆమెను ఏనాడూ చూడలేదు. ఆమె ఫోన్ నెంబర్ కూడా లేదు.

మరో అర్ధగంట తర్వాత ఇంట్లో వుండలేకపోయాడు. గెస్ట్‌హౌస్ అడ్రస్ గుర్తుంది. అందువల్లే కారు తీసుకుని ఆమెను వెతుక్కుంటూ బయల్దేరాడు.

ఆ రోడ్‌లో పది కిలోమీటర్ల దూరం వెళ్ళాక, అటు చూడగానే గుండె కొట్టుకోవడం ఆగింది... రోడ్ పక్కగా ఆగి వుంది కారు.

తన కారాపి అటుగా పరుగెత్తాడు విజయ్. వణుకుతున్న చేతులతో కారు ఫ్రంట్ డోర్ తెరిచాడు.

డ్రైవింగ్ సీట్లోనే వున్న మానస కళ్ళు తెరిచే వుంది కాని...

* * *

"ముప్ఫయ్యారు గంటలు గడిచాక కూడా ఆమె ఈ లోకంలోకి రాలేదంటే, బహుశా ఊహాతీతమైన దృశ్యమేదో చూసి వుండాలి" రాబర్ట్ అతడి ముఖంలోకే



చూస్తూ అన్నాడు.

"నేనూ అదే అనుకుంటున్నాను" విజయ్ తలాడించాడు. "మనమోసారి మానసను డాక్టర్ దగ్గరకు తీసుకెళ్తే మంచిదనుకుంటున్నాను."

రాబర్ట్ తల అడ్డంగా ఆడించాడు. "అంతకన్నా ముందు మనమిద్దరం ఆ గెస్ట్‌హౌస్ వరకూ వెళ్ళి రావడం కరక్ట్ అనిపిస్తోంది."

విజయ్ అతడి కళ్ళల్లోకి చూసాడు. 'రాబర్ట్ తనకు బాల్య స్నేహితుడే కాదు. సరైన సలహా ఇచ్చే మేధావి.'

"పద వెళ్దాం."

ఇద్దరూ ఇంట్లోంచి బయటకు నడిచారు.

జె.వి.బాబు

* * *

రోడ్డుపక్కన ఆగింది కారు.

విజయ్, రాబర్ట్ కారు దిగి పదడుగులు ముందుకే సారు.

"రాబర్ట్! మానస కారు ఆగివున్న ప్రదేశం ఇదే."

అతడు చుట్టూ పరిశీలనగా చూసాడు. సిటీకి దగ్గరే వున్నప్పటికీ, హైవే ప్రాంతం కావడంతో జన సంచారం తక్కువగా వుంది. వాహనాల రాకపోకలు ఎక్కువగా సాగుతున్నాయి.

"ఇక్కడే మానస షాక్‌కి గురయ్యి వుంటుందని అనుమానమా?"

"పార్టీనుండి బయలుదేరిన మానస, ఇక్కడివరకూ కారు డ్రైవ్ చేసుకొచ్చిందంటే, తను అప్పటివరకూ కాన్షియస్‌గా వున్నట్టే కదా?"

రాబర్ట్ చుట్టూ మరోసారి పరిశీలనగా చూసాక "తనిక్కడ షాక్‌కి గురయ్యే పరిస్థితి... ఊహుఁ! నాకు కనిపించడం లేదు... మనం గెస్ట్‌హౌస్ వరకూ వెళ్దాం"చెప్పాడు.

విజయ్ తలాడించాడు. ఇద్దరూ కారెక్కారు.

కారు కదిలి నాలుగు కిలోమీటర్లు వెళ్ళాక విజయ్ రోడ్‌సైడ్ వున్న పాన్‌షాప్‌లో గెస్ట్‌హౌస్ డీటైల్స్ చెప్పి వెళ్ళవలసిన దారి గురించి అడిగితే అతడు ఎలా వెళ్ళాలో వివరించాడు.

దారిన కనిపించిన వాళ్ళను అడుగుతూ గెస్ట్‌హౌస్ చేరుకునేసరికి అర్ధగంట పైగానే పట్టింది.

కారు ఆపి దిగబోతున్న విజయ్, రాబర్ట్‌కేసి యధాలాపంగా చూస్తే అతడేదో దీర్ఘాలోచనలో మునిగిపోయినట్టుగా కనిపించింది. "ఏమాలోచిస్తున్నావ్?"

"మానస ఈ గెస్ట్‌హౌస్‌కి రావడం ఇదే మొదటిసారా?!"

"అవును."

"మనిద్దరం ఇక్కడికి చేరుకోవడానికి రూట్ గురించి ఎంతోమందిని అడిగాం. రెండుమూడుచోట్ల రాంగ్ రూట్లోకి వెళ్ళాం... అలాంటిది మానస బాగా పొద్దుపోయాక ఒంటరిగా ఇక్కడివరకూ ఎలా చేరుకోగలిగింది?!"

ఆ ప్రశ్నతో విజయ్ కూడా కన్ఫ్యూజ్ అయ్యాడు. కాని మరోలా ఆలోచించడానికి మనస్కరించక "ఇక్కడికి చేరుకోవడానికి బాగా ఇబ్బందిపడి వుండొచ్చు"అంటూ కవర్ చేసాడు.

ఇద్దరూ కారు దిగారు.

సరిగ్గా రెండడుగులే ముందుకుపడ్డాయి. మూడో అడుగు ముందుకు పడకుండా ఆగింది. కారణం - ఎదురుగా కనిపించిన ఆ వ్యక్తి!

వాళ్ళను తదేకంగా చూస్తూ దగ్గరగా వచ్చాడా వ్యక్తి. "మీరు...?!" ప్రశ్నార్థకంగా చూస్తూ అదోలా కళ్ళెగరేసాడు.

ఆ వ్యక్తిని చూస్తుంటేనే అర్థమైపోతుంది... పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి సంబంధించినవాడు... బట్! ఈ గెస్ట్‌హౌస్‌కి పోలీసాఫీసర్ ఎందుకొచ్చాడు?

వాళ్ళిద్దరూ ముఖాలు చూసుకున్నారు. రాబర్ట్ తల తిప్పి అతడిమీద దృష్టి నిలిపి చెప్పాడు. "నా పేరు రాబర్ట్ బిజినెస్ మ్యాన్‌ని. ఇతడు నా ఫ్రెండ్ విజయ్. ... మీరు?!"

"టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జ్ఞానేశ్వర్... మీరిక్కడికెందుకొచ్చారు?!"

కొద్ది క్షణాల సంశయం తర్వాత రాబర్ట్ చెప్పాడు. "ఈ గెస్ట్‌హౌస్‌లో నిన్న రాత్రి జరిగిన పార్టీకి నా ఫ్రెండ్ మిసెస్ వచ్చింది. పార్టీనుండి ఇంటికొస్తూ దార్లో... ఎందుకనో షాక్‌లోకెళ్ళింది. గత ముప్పయ్యారు గంటలుగా తను ఆ షాక్‌లోనే వుంది..."

తన మాటలు విన్న ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యపోతాడనుకుంటే, అతడదోలా నవ్వడం రాబర్ట్‌ని అయోమయానికి గురిచేసింది. అప్పుడే మరేదో అనుమానమూ కలిగింది. "...మీరెందుకు నవ్వుతున్నారు?"

"నేనోసారి మీ ఇంటివరకూ వచ్చి ఆమెను చూడొచ్చా?"

"ముందు నా ప్రశ్నకు జవాబివ్వలేదు."

"అక్కడ చాలా ప్రశ్నలకు జవాబులు దొరుకుతాయి." అతడు అదే నవ్వును కంటిన్యూ చేసాడు.

"ఒకసారి గెస్ట్‌హౌస్‌ని చూసి..."

"నేను వచ్చింది ఆ పనిమీదే...గెస్ట్‌హౌస్ అంతా చూసాను. మీరిక చూడవలసిన అవసరం లేదు."

రాబర్ట్ విజయ్ ముఖంలోకి చూసాడు. విజయ్ మౌనంగా వెనుతిరిగాడు.

* * *

జ్ఞానేశ్వర్ ఆమె చెంప మీద గట్టిగా తట్టాడు. ఆమె తల తిప్పి చూడలేదు. అతడు తల తిప్పి వారిద్దరికేసి చూసి "ఏదైనా దృశ్యం చూస్తే ముప్పయ్యారు గంటల పాటు ఇలా షాక్‌లో వుండిపోతుందని ఎలా అనుకున్నారు?! ఎలాంటి సంఘటన ఎదురైనా మనిషికి కలిగే షాక్ తాత్కాలికమే. కొద్ది నిముషాలు లేదా కొద్ది గంటలు... ఇలా గంటలు తరబడి షాక్‌లో వుండిపోవడం జరగదు."

"మరి తనిలా...?!" వారిద్దరూ ఒకేసారి అన్నారు.

"ఎజోరిన్" అనే మత్తుమందు ప్రభావం ఇది. ఈ మందు డోస్ ఎక్కువైతే మెదడు పనిచేయడం మానేస్తుంది. శరీరం అచేతనంగా మారుతుంది... ఒక్కోసారి మనిషి ఇలా వారం పది రోజులు కూడా వుండిపోవచ్చు. ఇలాంటి సమయంలో వీరికి యాంటీడోస్ ఇవ్వాలి. కాని మీలాంటి వాళ్ళు పరిస్థితేమిటో అర్థం కాక అయోమయంలో వుండిపోవడం, డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళకపోవడమూ జరుగుతుంది."

విజయ్ ముఖంలో కంగారు కదలాడింది. "మానస...తనకు మత్తుమందు... ఎవరిచ్చారు?!... అసలు ఇదేమిటిలా?!..."

జ్ఞానేశ్వర్ జేబులోనుండి ఓ బాటిల్ తీసాడు. "ఎజోరిన్'...! ఆ గెస్ట్‌హౌస్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఇన్‌ఫర్మేషన్ అందుకున్న నేను ఓసారి పరిశీలిద్దామని అక్కడికి వెళ్ళాను. అక్కడ ఈ బాటిల్ దొరకగానే కంగారుపడ్డాను. విదేశాల్లో నీచ, నికృష్ట కార్యక్రమాలు చేయాలనుకున్నప్పుడు వాడే ఈ మత్తుమందు ఇక్కడికెలా వచ్చిందా- అని ఆశ్చర్యపోయాను. రెండురోజుల క్రితం అక్కడో పార్టీ జరిగిందని తెలుసు. ఆ పార్టీలో ఎవరైనా ఈ డ్రగ్ వాడారా?!... అసలా పార్టీలో ఏం జరిగింది?... ఇదంతా తెలియాలంటే ఈమె స్పృహలోకి రావాలి... సో! వెంటనే మనం తనను డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాలి."

మానసను కారులోకి ఎక్కించాక, విజయ్ డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు.

కారు ముందుకుపోతుంటే వెనుక సీట్లో కూర్చున్న జ్ఞానేశ్వర్ ప్రశ్నించాడు. "మీ ఆవిడ తరచుగా పార్టీలకు వెళ్తూ వుంటుందా?"

"నేను లేకుండా ఇలాంటి పార్టీలకు అటెండ్ కావడం ఇదే మొదటిసారి."

అతడు నవ్వాడు. "అందువల్లే తనలా షాక్‌కి గురయ్యింది."

* * *

యాంటీ డోస్‌తో అర్థగంటలో స్పృహలోకొచ్చింది మానస.

ఆమె కాస్త కుదురుకున్నాక విజయ్ ప్రశ్నించాడు. "మానసా!... నిన్న రాత్రి పార్టీకి వెళ్ళావ్... అక్కడ... అక్కడేం జరిగింది?!"

జరిగిందంతా గుర్తుచేసుకోవడంవల్ల కాబోలు ఆమె తనువు వణికింది. భయంతో పెదవులు బిగపట్టింది. పిచ్చి చూపులు చూడడం మొదలయ్యింది.

విజయ్ ఆమె భుజాల చుట్టూ చేతులేసి దగ్గరగా తీసుకున్నాడు. "... మానసా! నువ్విప్పుడు నాతో వున్నావ్. నీకేం భయంలేదు...ఒకే ... ఒకేనా?!..."

ఆమె వణుకు తగ్గింది. అతి కష్టంమీద పెదవి విప్పింది. "సుమ కాలేజీలో నా ఫ్రెండ్. కాలేజీ స్టడీ అయిపోయాక ముంబాయి వెళ్ళిపోయింది. వారం రోజుల క్రితం 'షాపింగ్ మాల్'లో కలసి హైదరాబాద్ వచ్చేసానని, రెండు రోజుల్లో తన పుట్టినరోజు వుందని తప్పకుండా రమ్మని చెప్పింది... సరేనన్నాను... మా వారితో కలిసే ఆ పార్టీకి వెళ్ళాలనుకున్నాను. కాని ఆయన రాలేని స్థితిలో ఆ పార్టీకి నేనే బయల్దేరాను. ఆ గెస్ట్‌హౌస్ వెతికి పట్టుకోవడమూ చాలా కష్టమయ్యింది. ఎలాగోలా అక్కడికి చేరుకుని లోపలికి వెళ్ళేసరికి... పదిమందే వున్నారు...నేను గెస్ట్‌హౌస్ లోపలికి అడుగుపెట్టాను...

* * *

"హాయ్ మానసా!..." సుమ ఎదురొచ్చి గట్టిగా కౌగిలించుకుంది. ఆ క్షణం ఆమె నోటినుండి గుప్పుమంటూ వచ్చిన ఆ వాసనకు మానస కడుపులో దేవినట్టయ్యింది.

మానస మాట్లాడకముందే సుమ అటునిటు చూసి "...ఏంటి! మీ వారితో కలసి వస్తానన్నావ్... తనతో కలసి రాలేదా?" ప్రశ్నించింది.

అక్కడున్న నలుగురు మగాళ్ళు తనకేసి చూస్తున్న అసహ్యకరమైన చూపులు గమనిస్తూనే జవాబు చెప్పింది. "ఆయన చాలా బిజీగా వున్నారు. రాలేకపోయారు."

సుమ రిలాక్స్‌గా నవ్వింది. "థాంక్‌గాడ్! మీవారు ఎక్కడొస్తారో, ఆయనకు మా కల్చర్ ప్రజంట్ చేయడం, ఒప్పించడం ఎలా?- అని ఆలోచిస్తూ బాధపడుతున్నా. ప్రస్తుతానికి ఆ ప్రాబ్లమ్ తప్పింది."

మానసకు ఆ వాతావరణం ఇబ్బందిగా అనిపించడంతో, చేతిలోవున్న గిఫ్ట్ ప్యాకెట్ ఫ్రెండ్‌కి అందించి చెప్పింది". విష్ యూ హేపీ బర్త్‌డే సుమా!... కేక్ కట్ చేస్తే నేను త్వరగా బయల్దేరుతాను."

"వెళ్తున్నావులే... ముందు నా ఫ్రెండ్స్‌ని పరిచయం చేయనివ్వు..." అంటూ జంటలుగా వున్న వాళ్ళవైపు తీసుకెళ్ళింది.

చేతులు కలపడం, హగ్ చేసుకోవడానికి ప్రయత్నించడం నచ్చకపోయినా భరించింది. ఆ తర్వాత బర్త్‌డే కేక్ కట్ చేసింది సుమ.

కేక్‌తోపాటు అందించిన కూల్‌డ్రింక్ తాగిన అర నిముషానికే ఏదో తెలియని మత్తు తను ఆవరిస్తున్న ఫీలింగ్ కలిగిందామెకు. ఆ మత్తులో ఎంతసేపుందో తెలియదు. మెల్లగా లేచి హాల్లోనుండి దగ్గరున్న గదిలోకి వెళ్ళబోతూ అటుచూసి, అలాంటి స్థితిలోనూ విస్మయానికి గురయ్యింది.

గ్రూప్ సెక్స్ అనేది కలలో కూడా ఊహించలేదు. ఊహాతీతమైన దృశ్యం... ఆమె తల విదిలించాలని ప్రయత్నించింది.

అప్పుడే ఒక వ్యక్తి తన దగ్గరగా రావడం కనిపించింది. "...కమాన్ యార్!... ఇందాకటినుండి నా చూపు నీమీదే...రా..."

సుమ గొంతు కూడా వినిపించింది. "...ఫిల్మ్‌కి ఫ్రెష్‌నెస్‌కోసం పిలిపించా..."

ఏదో అర్థమవుతోంది. మనసు, తనువు ఎదురు తిరుగుతున్నాయ్... అడుగులు...

"ఏయ్! తను బయటకెళ్తోంది... ముందు ఇంజక్షనివ్వు..." ఎవరో ఏదో గుచ్చారు.

ఆ తర్వాత పరుగెత్తడం మాత్రమే తనకు తెలుసు. కారు తీసింది... తనువులోని అణువణువునున్న శక్తిని కూడగట్టుకుని కారు స్టార్ట్ చేసింది.

అలా ఎంత దూరం వెళ్ళిందో తెలియదు.

మత్తు మరింత ఎక్కువవుతోంది... స్పృహ వుందో, లేదో తెలియని స్థితి...

* * *

మానస వెక్కివెక్కి ఏడుస్తోంది.

అక్కడందరూ అదో రకమైన మూడ్‌లోకి జారిపోయారు.

ఎంతైనా ప్రొఫెషనల్ కాబట్టి జ్ఞానేశ్వర్ ముందుగా తేరుకున్నాడు. "మీ మిసెస్ చాలా అదృష్టవంతురాలు. వాళ్ళు తేరుకుని, సర్దుకుని వెతుక్కుంటూ రావడంతో ఆలస్యమయ్యింది. అప్పటికే మీరు తనను చేరుకోవడంతో ఆమె వాళ్ళ బారిన పడలేదు...లేకపోతే ఆ డ్రగ్ ప్రభావంతో అచేతనురాలైన తనను ఆ గెస్ట్‌హస్‌కి తీసుకెళ్ళి మగవాళ్ళంతా మృగాల్లా మారిపోయి వుండేవారు. పైగా ఆ దృశ్యాలను ఫిల్మ్‌గా మార్చి అమ్మడం... బహుశా ఇదంతా తలచుకోవడంతోపాటు రెండుసార్లు ఇచ్చిన డ్రగ్ ప్రభావంవల్ల ఆమె ఆ స్థితిలో వుండిపోయింది."

విజయ్ రిలాక్స్‌గా ఫీలయ్యాడు.

రాబర్ట్ అడిగాడు. "మరిప్పుడు వాళ్ళను ఎలా వెతికి పట్టుకోవడం?"

"వెరీ సింపుల్! మానసగారి దగ్గర మొబల్ నంబర్ వుంది. లేదా కాలేజీ ఫొటోలు, కాలేజీ రికార్డ్- వీటి ఆధారంగా ఫొటో, ఫోన్ నెంబర్స్‌తో సులభంగా పట్టుకోవచ్చు... జస్ట్! అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని పరిశోధించడానికి వచ్చిన నాకు బ్లూఫిల్మ్ గ్యాంగ్ దొరికింది... ఎనీహౌ! ...ఇలాంటి వ్యక్తులను చట్టం పట్టుకునేలా చేయడానికి తన ప్రమేయం లేకుండానే దోహదపడ్డారు మానసగారు... థాంక్స్ టు హర్..."

మానస భావరహితంగా అతడిని చూసింది.

"వన్‌మోర్ అడ్వైజ్ మిస్టర్ విజయ్! ప్రస్తుతమున్న పరిస్థితుల్లో పాత పరిచయస్తులైనా సరే, ఆడవాళ్ళను ఒంటరిగా పార్టీలకు పంపకండి... దిస్ అడ్వైజ్ ఫర్ ఆల్..." జ్ఞానేశ్వర్ హాస్పిటల్ నుండి బయటకు నడిచాడు.

★